సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



చిరకాల కోరిక సాకారం

ధర్మవరం ప్రజల చిరకాల కోరిక త్వరలో సాకారం కానుంది. పట్టణంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. IIలో



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.5°/14.8°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మార్కెట్‌కు 2 వేల క్వింటాళ్ల చింతపండు



హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 20 లారీలు (2000 క్వింటాళ్లు) చింతపండు వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌లో కరిపులి (ప్రథమ శ్రేణి) రకం క్వింటా రూ.20,000–25,000 వరకూ, ప్లవర్ (ద్వితీయ శ్రేణి రకం) రూ.9,600–14,000 వరకూ, బోటు రకం (తృతీయశ్రేణి) రకం రూ.3,000–8,000 వరకూ ధర పలికినట్లు తెలిపారు.

బాధ్యతగా పనిచేయండి



మినీఅంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీకుమారి

గాండ్లపెంట: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా పనిచేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి అన్నారు. మండల కేంద్రంలోని సోమయాజులపల్లి గ్రామంలోని ప్రధాన అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పలు రికార్డులను, చిన్నారులు, గర్భిణుల రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో చిన్నారులకు, గర్భిణులకు అందించాలని పీడీ ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. పీడీతో పాటు నల్లచెరువు సీడీపీఓ గంగరత్నమ్మ, సూపర్‌వైజర్లు పద్మావతి, రఫీమున్నీసా ఉన్నారు.

పెనుకొండ డీఎస్పీగా షేక్ బాజీజాన్ సైదా

పుట్టపర్తి టౌన్: పెనుకొండ డీఎస్పీగా షేక్ బాజీజాన్ సైదా నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలువురు డీఎస్పీలను బదిలీ చేశారు. అలాగే పలువురు సీఐలకు పదోన్నతులు కల్పిస్తూ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో గుంటూరు రేంజ్‌లో సీఐగా పనిచేస్తున్న షేక్ బాజీజాన్ సైదాకు పదోన్నతి కల్పిస్తూ పెనుకొండ డీఎస్పీగా నియమించారు. పెనుకొండలో డీఎస్పీగా ఉన్న జి. హుస్సేన్ పీరాను అప్పా(ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ, అనంతపురం)కి బదిలీ చేశారు. ఇక అనంతపురం డీఎస్పీగా జి. వీర రాఘవరెడ్డిని నియమించారు. అక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న జి. ప్రసాద రెడ్డిని మదనపల్లికి బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న కే. వెంకటేశ్వరరావును అనంతపురం పీటీసీకి, అలాగే జి. శివభాస్కర్ రెడ్డిని గుంతకల్లు డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విధులకు హాజరైన వైకేపీ ఉద్యోగులు



సమ్మె విరమిస్తున్న లేఖ అందజేస్తున్న జేఏసీ నాయకులు

పుట్టపర్తి అర్బన్: డిమాండ్ల సాధనలో భాగంగా ఆరు రోజులుగా సమ్మె బాట పట్టిన వైకేపీ ఉద్యోగులు గురువారం విధుల్లోకి చేరారు. తాము సమ్మె విరమించి విధులకు హాజరవుతున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్యకు వారు లిఖిత పూర్వకంగా లేఖ అందజేశారు.

దీప స్తంభాలపై శాసనాల గుర్తింపు



శాసనం చూపుతున్న మైనాస్వామి

కదిరిటౌన్: స్థానిక లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఉన్న దీప స్తంభాలపై శాసనాలను గుర్తించినట్లు గురువారం చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. మహా మంటపం ముందు ఉన్న ధ్వజస్తంభం పక్కనున్న దీప స్తంభంపై తెలుగు లిపిలో ఉన్న శాసనాలు ఉన్నట్లుగా ఆయన తెలిపారు. శాలివాహన శకం 1310 సంవత్సరంలో దీప స్తంభాన్ని నిలబెట్టారని, దీనిని హరిహర రాయలు ఏర్పాటు చేసినట్లు శాసనంలో ఉందన్నారు. అలాగే గుడి రాజగోపురం పక్కనున్న దీపస్తంభాన్ని 1469లో ఏర్పాటు చేసినట్లుగా కన్నడలిపిలో శాసనం ఉందన్నారు.

జలకళ .. సాగు కళకళ !

ఇక్కడ కనిపిస్తున్న రైతు పేరు నాగభూషణ. వీరిది పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామం. ఈయనకు నాలుగు ఎకరాల భూమి ఉంది. వైఎస్సార్ జలకళ పథకం కింద దరఖాస్తు చేసుకోగా గత ఏడాది బోరు వేశారు. సమృద్ధిగా నీళ్లు పడ్డాయి. విద్యుత్ సర్వీస్ తీసుకున్న విషయం అధికారులకు చెప్పగానే సబ్‌మెర్సిబుల్ పంప్‌సెట్, పైపులు, స్టార్టర్, మోటర్‌కు కావాల్సిన అన్ని పరికరాలు అందజేశారు. జియోట్యాగ్ కూడా చేశారు. మోటర్ బిగించగా నీళ్లు రావడంతో రైతు నాగభూషణ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇకపై స్వంతంగా పంటలు సాగు చేస్తాను. అవసరమైతే చుట్టూ ఉన్న రైతులకు కష్ట కాలంలో నీళ్లు వదిలి పంటలను కాపాడుతానని అంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం మా కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు.

- జిల్లాలో జలకళ కింద 1592 మంది పొలాల్లో బోర్లు
- రూ.22.99 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- శరవేగంగా మోటర్ల పంపిణీ
- ఇప్పటికే 374 పంపుసెట్లు అందించిన అధికారులు
- పంపుసెట్లకు రూ.7.48 కోట్ల ఖర్చు



మోటార్ బిగించడంతో రైతు నాగభూషణ బోరు నుంచి వస్తున్న నీళ్లు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు ప్రభుత్వం నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే వైఎస్సార్ జలకళను అమలు చేస్తోంది. రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు బోరు వేయడంతో పాటు పంటలకు నీళ్లు అందించేలా వ్యవసాయ పంపు సెట్లు, సామగ్రిని కూడా ప్రభుత్వమే ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సబ్‌మెర్సిబుల్ పంపుసెట్లు

వైఎస్సార్ జలకళ పథకం కింద బోర్లు వేయించుకున్న రైతులకు పంపు సెట్‌లు అందజేసే కార్యక్రమం ఊపందుకుంది. గత ఏడాది కాలంగా బోర్లు వేయించుకున్న రైతులు మోటర్లు, విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జలకళ పథకం కింద బోర్లు వేసుకొని విద్యుత్ సరఫరా చేసుకున్న రైతులకు సబ్‌మెర్సిబుల్ పంపుసెట్లు అందజేసే కార్యక్రమం జోరుగా సాగుతోంది. దీంతో రైతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జలకళ కింద రూ.22.99 కోట్ల వ్యయం

జిల్లాలో జలకళ పథకం కింద ప్రభుత్వం ఇప్పటి వరకూ సుమారు రూ.22.99 కోట్లు వ్యయం చేసింది. ఇప్పటి వరకూ జలకళ పథకం వేసిన బోర్లకు మోటర్లు అమర్చే కార్యక్రమం పూర్తయితే ప్రత్యక్షంగా 7 వేల ఎకరాలకు పైగా మెట్ట భూమి సాగులోకి రానుంది. చిన్న, సన్నకారు రైతులకు ఒకే సర్వే నంబర్‌లో 2.5 ఎకరాల భూమి ఉన్న రైతులను జలకళ పథకం కింద ఎంపిక చేశారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్, వన్‌బీ తదితర వివరాలను సేకరించిన ప్రభుత్వం వీఆర్‌ఓ లాగిన్‌లో మంజూరు చేసి ఉపాధి పథకం లాగిన్‌కు పంపగానే సర్వే చేసి రైతుల అర్హతలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వెంటనే భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో రైతు పొలంలో నీటి లభ్యతను గుర్తించి బోరు పాయింట్ ఇస్తారు. జియో ట్యాగ్ పూర్తి కాగానే బోరు వేస్తారు. బోరు వేయించుకున్న రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం ఆధారాలు ఇవ్వగానే విద్యుత్ స్తంభాలు అమర్చి లైను లాగి సర్వీస్ నంబర్ ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్ అందజేస్తారు. ఇవన్నీ రైతులు సమకూర్చుకోగానే సంబంధిత వివరాలను సర్వీస్ నంబర్‌ను టెక్నికల్ అసిస్టెంట్లు ద్వారా అప్‌లోడ్ చేయగానే కలెక్టర్ అనుమతుల మేరకు పంపు సెట్లు అమర్చే కార్యక్రమం పూర్తి చేస్తారు.

374 మంది రైతులకు పంపిణీ



బుచ్చయ్యగారిపల్లి రైతు ఆదినారాయణకు పంపు సెట్ అంజేస్తున్న అధికారులు

జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర క్లస్టర్లలో 32 మండలాల్లో జళకల పథకం కింద 1592 మంది రైతులు బోర్లు వేసుకున్నారు. పంపుసెట్ల కోసం 940 మంది రైతులు విద్యుత్ సర్వీస్ తీసుకున్నారు. అందులో ఇప్పటి వరకూ 374 మంది రైతులకు మోటర్లు అందజేశారు. వాటి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7.48 కోట్లు ఖర్చు చేసింది. దీంతో వేలాది ఎకరాల మెట్ట భూమి సాగులోకి రానుంది. పంపుసెట్లు అందజేసేందుకు సిల్వర్, డక్కన్, పీఅండ్‌జీ, క్రాంప్టన్‌గ్రీవ్స్ కంపెనీల పంప్‌సెట్లు అందజేస్తున్నారు.

రూ.3.5 లక్షల లబ్ధి పొందాను



నాకు 4 ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే నాలుగు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. అయితే గత ఏడాది జలకళ పథకం కింద బోరు వేయగా మూడించుల నీళ్లు పడ్డాయి. ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే బోరు వేశారు. ఇటీవల సిబ్బంది వచ్చి బోర్‌లో నీళ్లు ఎంత వరకూ ఉన్నాయని చెక్ చేశారు. నీళ్లు సమృద్ధిగా ఉన్నాయని నిర్ధారించి నల్లమాడకు పిలిచి పంపుసెట్ , బోరు సామగ్రిని అందజేశారు. బోరు తవ్వకానికి, సామగ్రికి సుమారు రూ.3.5 లక్షలను ప్రభుత్వం ఖర్చు చేసింది. చాలా సంతోషంగా ఉంది. పండ్ల తోటలు సాగు చేసి కుటుంబాన్ని పోషించుకుంటాను.

– ఆదినారాయణ, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం

జగనన్న మేలును మరువను



ఇటీవల నాకు పంప్‌సెట్ ఇచ్చారు. మోటార్ బిగించాను. సమృద్ధిగా నీళ్లు వస్తున్నాయి. పంటల సాగుకు భూమిని సిద్ధం చేశాను. మొదటి పంటగా వేరుశనగ సాగు చేస్తున్నా. బోరు వేయడంతో పాటు మోటారు, బోరు సామగ్రి ఉచితంగానే అందజేసిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నటికీ మరువను. మరోసారి ఆయనకు మద్దతు పలుకుతాం.

– రాజన్న, పెడపల్లి, పుట్టపర్తి

అందరికీ పంపుసెట్లు



వైఎస్సార్ జలకళ పథకం కింద బోర్లు వేసుకొని విద్యుత్ సర్వీసు కల్గిన ప్రతి రైతుకూ పంపు సెట్లు అందజేస్తాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రతి ఎకరా సాగులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది. బోర్లు వేసుకున్న రైతులంతా పంటలు సాగు చేయాలి. ముఖ్యంగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సబ్సిడీల ద్వారా సూక్ష్మ సేద్య పరికరాలను అందిస్తున్నాం.

– విజయేంద్రప్రసాద్, పీడీ, డ్వామా

దక్షిణ భారత సైన్స్‌ఫేర్‌లో 'అనంత' సత్తా



సత్తా చాటిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫేర్)లో జిల్లా ప్రాజెక్టులు సత్తా చాటాయి. బెంగళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఏపీ విద్యాశాఖ సంయుక్తంగా విజయవాడలో గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. దక్షిణ భారతదేశానికి చెందిన ఆరు రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. రెండు ప్రాజెక్టుల విద్యార్థులు విజేతలుగా నిలువగా, మరో రెండు ప్రాజెక్టుల విద్యార్థులు ప్రత్యేక బహుమతులకు ఎంపిక కావడం విశేషం. గుత్తి కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎస్. బెన్నీ, కె. మహేంద్ర రెడ్డి, గైడ్ టీచర్ శామ్యూల్ ప్రతాప్ సహాయంతో తయారు చేసిన 'కవచ్, రైల్వే లైట్స్ విత్ బ్లూటూత్' అనే ప్రాజెక్టు గ్రూపు విభాగంలో, కసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్. హేమసాగర్ తన గైడ్ టీచర్ నారాయణ సాయంతో 'జామెట్రీ డ్రైవ్ ఎకో టాయిలెట్' అనే అంశంపై చేసిన ప్రాజెక్టులు వ్యక్తిగత విభాగంలో రాష్ట్రస్థాయి నాలుగో స్థానంలో నిలిచాయి. అలాగే, టీచర్ గ్రూప్‌లో కరుట్లపల్లి జిల్లా పరిషత్ టీచర్ మహమ్మద్ రఫీ తయారు చేసిన ప్రాజెక్టు, పుట్లూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని పి. అనూహ్యారెడ్డి, గైడ్ టీచర్ రాజేశ్వరి సహకారంతో రూపొందించిన ప్రాజెక్టు ప్రత్యేక బహుమతులకు ఎంపికయ్యాయి. ప్రతిష్టాత్మక దక్షిణ భారత సైన్స్ ఫేర్‌లో జిల్లా నుంచి పాల్గొన్న నాలుగు ప్రాజెక్టులూ వివిధ విభాగాల్లో బహుమతులకు ఎంపిక కావడం ఆనందకరమని జిల్లా విద్యా శాఖాధికారి వి.నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. విజేతలు, గైడ్ టీచర్లను, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- 5 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైన నోఎంట్రీ
- ఏర్పాట్లలో అధికారులు బిజీ బిజీ



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: 'ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి. లోటుపాట్లు లేకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలి' అని సంబంధిత అధికారులను డీఆర్‌ఓ కొండయ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు మూడు దశల్లో జరగనున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పరీక్షా కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. నిరంత విద్యుత్, తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కేంద్రం, పోలీస్ బందోబస్తు, జవాబు పత్రాల తరలింపునకు పోస్టల్‌శాఖ ద్వారా బండిల్స్ సిద్ధం చేయడం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. నూతన జిల్లాలో మొదటిసారి కొత్తచెరువు జూనియర్ కళాశాలను ఇంటర్ స్పాట్ కేంద్రంగా చేశామన్నారు.

5 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 5 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని డీఆర్‌ఓ తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులకు 5 నుంచి 20 వరకూ, జనరల్ విద్యార్థులకు 11 నుంచి 20 వరకూ ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయన్నారు. అర గంట ముందే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు జనరల్ విద్యార్థులు 5 వేల మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,259 మంది హాజరుకానున్నట్లు చెప్పారు.

మార్చి నుంచి థియరీ పరీక్షలు

మార్చి 1న థియరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 11,528 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10,986 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్స్‌కు 48 కళాశాలలు, థియరీ పరీక్షలకు 41 జూనియర్ కళాశాలలు, నైతిక విలువలు, పర్యావరణ విద్య పరీక్షలకు 113 కళాశాలలు సిద్ధం చేశామన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఇంటర్ పరీక్షల నిర్వహణకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు డీఆర్‌ఓ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. జిరాక్స్ సెంటర్‌లను మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలను ఉంచి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్‌శాఖ సిబ్బందిని అవసరం మేరకు పరీక్ష విధులను కేటాయించాలన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలను చేరుకునేలా ఆర్టీసీ సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి రఘునాథరెడ్డి, ఆర్ఐఓ అండ్ కన్వీనర్ సురేష్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీకాంతరెడ్డి, చెన్నకేశవప్రసాద్, మల్లికార్జున, సీఐ కొండారెడ్డి, ఆర్టీసీ డీఎం హిదయతుల్లా, ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ శరవణ్, కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ, పోస్ట్‌మాస్టర్ జయపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెత్తందారులదే పెత్తనం !

- టీడీపీలో కుల పెత్తనంలో విసిగిపోయిన కార్యకర్తలు, అభిమానులు
- పాతికేళ్లుగా ఒకరిద్దరి చేతుల్లోనే ఎమ్మెల్యే టికెట్లు, నామినేటెడ్ పదవులు
- మూడు దశాబ్దాలుగా మహిళలు, బీసీ, మైనార్టీలను అణగదొక్కిన వైనం
- మరోవైపు మహిళలు, వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోన్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, పుట్టపర్తి: కులం లేదు.. మతం లేదు.. సామాజిక సమన్యాయం అసలే లేదు. అక్కడంతా పెత్తందార్లు చెప్పిందే తెలుగుదేశం పార్టీ అధిష్టానం వింటోంది. గత మూడు దశాబ్దాలుగా హిందూపురం పార్లమెంటులో ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది. పరిటాల రవీంద్ర.. తర్వాత సునీత.. అనంతరం వారి తనయుడు శ్రీరామ్.. ఇలా ఆ కుటుంబం అనుమతి పొందిన వారికే టీడీపీ పెద్దలు టికెట్లు ఇస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుల రాజకీయం చేస్తూ.. పరిటాల కుటుంబానికే జిల్లాలో అధికంగా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈసారి కూడా ఇదే తీరులో అధిష్టానం పరిటాలకు పరోక్షంగా పగ్గాలు ఇస్తుందా? లేక సొంత నిర్ణయాలతో.. అభ్యర్థులను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేస్తోందా? అనేది ఉత్కంఠగా మారింది. పరిటాల నాయకత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలను రాజకీయంగా ఎదగకుండా అణచివేతకు గురయ్యారు. మూడు దశాబ్దాలుగా జిల్లా టీడీపీలో ఇదే ధోరణి కొనసాగుతోంది. ఫలితంగా పార్టీ వైఖరి నచ్చక చాలామంది టీడీపీ వీడారు. అయినా అధిష్టాన ధోరణి మాత్రం మారడం లేదు.

వాళ్లకే పెద్దపీట

హిందూపురం పార్లమెంటు పరిధిలో 2004 నుంచి ఎన్నికలను పరిశీలిస్తే.. కేవలం ఒకే సామాజిక వర్గానికి చెందిన మహిళలకు మాత్రమే అసెంబ్లీ టికెట్లు ఇచ్చారు. అందులో ధర్మవరం నుంచి 2004లో గోనుగుంట్ల జయమ్మ ఉన్నారు. మరో మహిళ పరిటాల సునీత కావడం విశేషం. పరిటాల సునీత 2006 పెనుకొండ ఉప ఎన్నిక బరిలో దిగారు. ఆ తర్వాత 2009, 2014లో రాప్తాడు నుంచి పోటీ చేశారు. హిందూపురం పార్లమెంటు పరిధిలో టీడీపీ తరపున గత నాలుగు పర్యాయాల్లో పోటీ చేసిన మహిళలు కూడా వీరిద్దరే. 2019 ఎన్నికల్లో పార్లమెంటు పరిధిలో ఒక్క మహిళకు కూడా టీడీపీ అవకాశం ఇవ్వలేదు. ఈసారి కూడా ఇప్పటి వరకు ఎవరినీ ప్రకటించకపోవడం గమనార్హం.


మహిళలకు అండగా వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ఎంతో గౌరవం లభిస్తోంది. హిందూపురం పార్లమెంటు సమన్వయకర్తగా శాంతమ్మ, హిందూపురం, పెనుకొండ సమన్వయకర్తలుగా దీపిక, ఉషశ్రీచరణ్‌లకు అవకాశం ఇచ్చి బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు. రానున్న ఎన్నికల్లో ఒకే పార్లమెంటు పరిధిలో వెనుకబడిన వర్గాలకు చెందిన ముగ్గురు మహిళలకు అవకాశం రావడం ఇదే తొలిసారి. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు.. బ్యాక్‌బోన్ అని నమ్మిన వైఎస్ జగన్ ఆ దిశగా వారిని నడిపిస్తున్నారని అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పెనుకొండ నియోజకవర్గంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మంగమ్మ ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

• ఆనందమానందమాయే..



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న చెర్లోపల్లి వలంటీర్ మహేశ్వరరెడ్డి



హిందూపురం: 7వ వార్డులో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రిజ్వానా

తెల్లవారక ముందే వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందించడం మొదలు పెట్టడంతో పింఛన్‌దారుల ముఖాలు వెలిగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలోని 32 మండలాల్లో అర్హులైన 2,74,578 మంది లబ్ధిదారులకు రూ.81,95,62,500 మంజూరు కాగా మొదటిరోజు 2,18,799 మంది లబ్ధిదారులకు రూ.65,32,18,000 పంపిణీ చేశారు. రూ.3 వేలు పింఛన్ చేతికి అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజుల పాటు పింఛన్ పంపిణీ కొనసాగుతుందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

పుట్టపర్తి అర్బన్:

సేవాగఢ్ ఉత్సవాలు విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లో ఈ నెల 13 నుంచి మూడ రోజుల పాటు జరిగే సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామంటూ అన్ని శాఖల అధికారులకు డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. సేవాలాల్ జయంతి ఉత్సవ ఏర్పాట్లపై గురువారం సేవాగఢ్‌లోని టీటీడీ కల్యాణ మంటపంలో సేవాగఢ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఇతర మండల అధికారులతో కలిసి వారు సమీక్షించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం, తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్ల ఏర్పాటుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా సమీప గ్రామాల్లో నాటుసారా అమ్మకాలు జరగకుండా చూడాలని సెబ్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు 13 నుంచి 15వ తేదీ వరకూ సేవాగఢ్‌లోనే ఉంటూ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

సోమందేపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పరిగి మండలం గణపతిపల్లికి చెందిన ట్రాక్టర్ యజమాని రామాంజినేయులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. డ్రైవర్ గోపాల్‌తోపాటు రామాంజినేయులుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి


రాము (ఫైల్)

రొద్దం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు... రొద్దం మండలం చిన్నకోడిపల్లికి చెందిన జయమ్మ కుమారుడు రాము (15) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆరు నెలల క్రితం కర్ణాటక సరిహద్దులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాము అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. కాగా, ప్రమాదం జరిగిన రోజే రాముతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం: ఒడిశాలోని భువనేశ్వర్ వేదికగా ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకూ జరిగే జాతీయ స్థాయి 73వ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఎంపికైన వారిలో లిఖిత్, సత్యప్రకాష్, ద్వారకానాథ్ రెడ్డి ఉన్నారు.

చిరకాల కోరిక సాకారం

- రూ.4 కోట్ల వ్యయంతో ధర్మవరంలో ఫోర్‌లేన్ రహదారికి భూమిపూజ
- త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితమిస్తామన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి
- టీడీపీ హయాంలో అంతులేని అవినీతితో నాసిరకం రహదారి నిర్మాణం
- చీప్ పాలిటిక్స్‌తో ప్రజలను మభ్యపెట్టాలని చూసిన రాజకీయ నాయకులు
- టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సొంత నిధులతో రోడ్డు వేస్తామంటూ నాటకాలు


రహదారి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం: పట్టణ ప్రజల చిరకాల కోరిక త్వరలో సాకారం కానుంది. ధర్మవరంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం కళాజ్యోతి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి హాజరై, భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ సంజీవయ్యతో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

కమీషన్ల కక్కుర్తితో నాసిరకం పనులు

టీడీపీ హయాంలో రూ.28 కోట్ల వ్యయంతో ధర్మవరం పట్టణంలో రహదారి ఏర్పాటు చేశారు. 2019లో అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి కమీషన్లకు కక్కుర్తి పడడంతో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకున్నాడు. దీంతో పట్టుమని పది నెలలు కూడా గడవక ముందే ఈ రహదారి మొత్తం పాడైపోయింది. ప్రధాన కూడళ్లు గుంతలమయమైంది. దీంతో అప్పటి నుంచి ఈ రహదారిపై రాకపోకలు నరకప్రాయమయ్యాయి. దీంతో నూతన రహదారి నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చొరవ తీసుకున్నారు. రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిన విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి సరికొత్త డ్రామాకు తెరలేపారు. కమీషన్ల కక్కుర్తితో నాడు అడ్డగోలుగా ప్రజాధనాన్ని కొల్లగొట్టి నేడు తన సొంత నిధులతో రోడ్డు వేస్తానంటూ తెరపైకి వచ్చారు.

అభివృద్ధికి మారుపేరు వైఎస్సార్‌సీపీ

సంక్షేమం, అభివృద్ధికి మారుపేరుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిచిందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. పట్టణంలో నాలుగు వరుసల రహదారి పనులకు గురువారం భూమిపూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ధర్మవరం పట్టణంలో ప్రధాన రహదారి దెబ్బతినడంతో ప్రజలు పడుతున్న అవస్థలు గుర్తించి కొత్త రహదారి నిర్మాణ ఆవశ్యకతపై సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్ గత ఏడాది డిసెంబర్ 5న రూ.4 కోట్లు నిధులు విడుదల చేస్తూ జీఓ జారీ చేశారని తెలిపారు. జనవరి 18న టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో పనులు ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టణ పరిధిలో 6.62కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. వదులు నేల ఉన్న పలు ప్రాంతాల్లో సీసీరోడ్డు, మిగిలిన ప్రాంతమంతా బీటీరోడ్డు వేస్తారన్నారు. ఈ పనులు త్వరతిగతిన పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.5వేల కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఇది ఓర్వలేని ప్రతిపక్షాలు ఇష్టారాజ్యంగా బురదజల్లే కార్యక్రమానికి తెరలేపాయన్నారు.

సూరి హయాంలో అంతులేని అవినీతి

టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి కనుసన్నల్లో ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా అంతులేని అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని కేతిరెడ్డి విమర్శించారు. తాజాగా ఎన్నికల సమీపిస్తుండటంతో రాజకీయ లబ్ధి కోసం తాను సొంత నిధులతో రోడ్డు వేస్తానని హైడ్రామాకు తెరలేపారన్నారు. కేవలం రెండు టిప్పర్లు తీసుకువచ్చి రోడ్డు వేస్తామని డ్రామా చేస్తే ప్రజలు నమ్మబోరన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన విషయం తెలుసుకుని రోడ్డు వేస్తానని చెప్పే సూరి నాటకాలు ప్రజలందరికీ అర్థమయ్యాయన్నారు. ప్రజల సొమ్ము తిన్న సూరి లాంటి వారు అవినీతి సొమ్ముతో రోడ్డు వేసి ప్రజల రుణం తీర్చుకుంటానంటే తనకు అభ్యంతరం లేదని, అయితే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డు తగిలితే సహించబోనని హెచ్చరించారు.

ఏసీబీ వలలో విద్యుత్ శాఖ ఏఈ


పట్టుబడిన ఏఈ చంద్రశేఖర్

గుత్తి: ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు వజ్రకరూరు విద్యుత్‌శాఖ ఏఈ చంద్రశేఖర్ పట్టుబడ్డాడు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ వజ్రకరూరు విద్యుత్ శాఖ ఏఈగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వజ్రకరూరు మండలం చాబాలకు చెందిన రైతు ఆనంద్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకుని ఏఈని కలవగా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. రూ.20 వేలు చెల్లిస్తానంటూ ఒప్పందం కుదుర్చుకున్న రైతు... ఏసీబీ అధికారులను సంప్రదించి, వారి సూచన మేరకు గురువారం సాయంత్రం గుత్తి బస్టాండు వద్ద ఉన్న ఏఈ చంద్రశేఖర్‌కు డబ్బులిస్తుండగా ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ ప్రభాకర్‌గౌడ్ వలపన్ని పట్టుకున్నారు. అనంతరం చంద్రశేఖర్‌ను గుత్తి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయానికి తీసుకెళ్లి రాత్రి పొద్దుపోయేవరకూ విచారించారు. పంచనామా అనంతరం నిందితుడిని శుక్రవారం ఉదయం కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

10న 'అనంత'లో న్యాయవాదుల సదస్సు


హిందూపురంలో కరపత్రాలు విడుదల చేస్తున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్/పెనుకొండ: ఈ నెల 10న అనంతపురంలోని జేఎన్‌టీయూ(ఏ) ఆడిటోరియంలో జరిగే న్యాయవాదుల సదస్సుకు తరలి రావాలని న్యాయవాదులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరి రామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హిందూపురం, పెనుకొండలోని బార్ అసోసియేషన్ కార్యాలయాల్లో స్థానిక న్యాయవాదులతో ఆయన కలిసి వర్క్‌షాప్‌నకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేసి, మాట్లాడారు. వర్క్ షాప్‌నకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అమానుల్లా, ప్రశాంత్‌కుమార్, మిశ్రా, వీఎస్ భట్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌ఠాకూర్, న్యాయమూర్తులు వెంకటశేషసాయి, దుర్గాప్రసాద్, సురేష్‌బాబు, మన్మథరావు, శ్రీనివాసరెడ్డి, శ్యామసుందర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. వివిధ అంశాలపై న్యాయమూర్తుల ప్రసంగాలు, ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న వారికి ఈ వర్క్‌షాప్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం రామిరెడ్డిని హిందూపురం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నూరప్ప ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హిందూపురంలో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నరసింహులు, సుదర్శన్, సిద్ధు, పీవీ శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెనుకొండలో జరిగిన కార్యక్రమంలో ఏజీపీ భాస్కరరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, న్యాయవాదులు చంద్రశేఖరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాష్, వినోద్‌నాయక్, విశ్వనాథ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి, నేరేడు చెట్లు దగ్ధం

తాడిమర్రి: మండలంలోని పూలఓబయ్యపల్లిలో రైతు యలమకూరు నారాయణరెడ్డికి చెందిన పండ్ల తోటలో బుధవారం రాత్రి మంటలు చెలరేగి 10 చొప్పున మామిడి, అల్ల నేరేడు, టేకు చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. తనకున్న 12 ఎకరాల్లో పన్నెండేళ్ల క్రితం 900 మామిడి, 100 అల్లనేరేడు, 200 టేకు మొక్కలను నారాయణరెడ్డి నాటారు. ప్రస్తుతం అవి పెద్ద మాన్లు కాగా మామిడి చెట్లు పూతతో ఉన్నాయి. చెట్లు కాలిపోయిన విషయం గురువారం ఉదయం అటుగా వెళుతున్న కొందరు రైతులు గమనించి సమాచారం అందించడంతో తన తమ్ముడు పుల్లారెడ్డితో కలసి బాధిత రైతు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఉద్దేశపూర్వకంగానే తన తోటకు నిప్పు పెట్టారని వాపోయాడు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వ్యక్తి మృతి

- బెంగళూరులో ఘటన
- బతుకు తెరువు కోసం వలస వెళ్లి మృతి చెందిన గోరంట్ల మండల వాసి


మహేశ్వరరెడ్డి (ఫైల్)

గోరంట్ల: అపార్ట్‌మెంట్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు... గోరంట్ల మండలం ఎగువ గంగంపల్లికి చెందిన పాప్పురి మహేశ్వరరెడ్డి (35)కి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా బెంగళూరులోని ఓ అపార్టుమెంట్‌లో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహేశ్వరరెడ్డి... మంగళవారం ఉదయం అపార్ట్‌మెంట్ పైనున్న నీటి ట్యాంక్‌ను పరిశీలించేందుకు పైకెక్కాడు. అనంతరం కిందకు దిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పైనుంచి కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక గురువారం ఆయన మృతి చెందారు. విషయం తెలియగానే ఆయన స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేనున్నానని.. మీకేం కాదని!



- ప్రజలకు భరోసా ఇస్తున్న 108 అంబులెన్సులు
- నాలుగేళ్లలో 3.73 లక్షల మందిని రక్షించిన రథాలు
- 82 వేల మందికి పైగా గర్భిణులకు సేవలు
- మండలానికి రెండు అంబులెన్సులు కేటాయించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆపదలో ఉన్నామని కాల్ వచ్చిందంటే చాలు కుయ్ కుయ్ మంటూ ముంగిటకే వచ్చేస్తుంది. బాధితులకు కొండంత ధైర్యం ఇచ్చేస్తుంది. దివంగత నేత వైఎస్సార్ హయాంలో పురుడు పోసుకున్న 108 పథకం ఆపన్నులకు అందిస్తున్న భరోసా అంతా ఇంతా కాదు. ఏపీలో అమలవుతున్న ఈ వ్యవస్థ దేశంలో మిగతా రాష్ట్రాలన్నిటికీ ఆదర్శంగా ఉంది. గడిచిన నాలుగేళ్లలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 108 అంబులెన్సుల ద్వారా 3.73 లక్షల మందికి పైగా సేవలు పొందారంటే ప్రజలకు ఎంతలా ఈ వ్యవస్థ సాంత్వన చేకూర్చిందో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ హయాంలో అధ్వానం..

ఎంతో గొప్ప ఉన్నతాశయంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని చంద్రబాబు పూర్తిగా నిర్వీర్యం చేశారు. డీజిల్‌కు డబ్బుల్లేవంటూ మొండి చేయి చూపారు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయక అటకెక్కించారు.

పునరుజ్జీవం పోసిన సీఎం జగన్

అవసాన దశకు చేరిన 108 వ్యవస్థపై సీఎం జగన్ వచ్చీ రాగానే ప్రత్యేక దృష్టి సారించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి మండలానికి ఒక అంబులెన్సు కూడా అందుబాటులో లేవు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలు ఉండగా 32 వాహనాలు మాత్రమే ఉండేవి. అవికూడా 5 లక్షల కిలోమీటర్లు పైగా తిరిగి అవసాన దశకు చేరాయి. అలాంటిది మండలానికి రెండు కొత్త అంబులెన్సులతో పాటు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులను తెచ్చారు. ఒక నియోనేటల్ (చిన్నారుల కోసం) అంబులెన్సుతో పాటు సిబ్బందినీ నియమించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అంబులెన్సు వ్యవస్థ పరుగులు పెడుతోంది. గత ప్రభుత్వంలో ఏడాదికి సగటున 45 వేల మందికి పైగా సేవలు అందేవి కావు. ఇప్పుడా పరిస్థితి మారింది. ఏడాదికి దాదాపు 1.10 లక్షల మంది 108 అంబులెన్స్ సేవలు అందుకున్నారు. గర్భిణులు, గుండెపోటు బాధితులు, డయాలసిస్ బాధితులు ఒకరేమిటి.. వేలాది మంది 108 అంబులెన్సుల్లోనే ఆస్పత్రులకు వెళుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఫోన్ చేసిన 25 నిముషాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లో అయితే 15 నిముషాల నుంచి 20 నిమిషాల్లో ఘటనా స్థలికి అంబులెన్సులు చేరుకుంటున్నాయి. నాలుగేళ్లలో గర్భిణులే 82 వేల మందికి పైగా సేవలు పొందారు.

గడిచిన నాలుగేళ్లలో 108 సేవలు అందుకున్న వారు ఇలా..

సంవత్సరం	సేవలు పొందిన వారి సంఖ్య	గర్భిణులు
2020	39,177	8,030
2021	1,09,446	10,446
2022	1,04,651	26,281
2023	1,19,953	20,051

ఉమ్మడి అనంత జిల్లాలో 108 వివరాలు ఇలా..

మొత్తం అంబులెన్సులు	66
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు	15
బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు	49
నియోనేటల్ అంబులెన్సులు	02
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు	165
పైలెట్లు (డ్రైవర్లు)	165

జిల్లాకు సరిపడా అంబులెన్సులు



సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక 108 సేవలు మెరుగుపడ్డాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాకు సరిపడా అంబులెన్సులు సమకూర్చింది. దాదాపుగా అన్ని మండలాలకు 2 అంబులెన్సులు ఉన్నాయి. దీంతో సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలికి వాహనం వెళ్లే సమయం బాగా తగ్గింది. ప్రభుత్వం నుంచి నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సిబ్బంది కూడా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తుండడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. – సంజీవరెడ్డి, 108 అంబులెన్సుల జిల్లా మేనేజర్

అదృశ్యమైన ఉపాధ్యాయుడు మహేంద్రరెడ్డి మృతి


మహేంద్రరెడ్డి (ఫైల్)


నల్లమాడ: అదృశ్యమైన ఉపాధ్యాయుడు రిజర్వాయర్‌లో శవమై తేలాడు. వివరాలు... నల్లమాడ మండలం బాసంవారిపల్లికి చెందిన ఎ.రామకృష్ణారెడ్డి, వెంకటరమణమ్మ దంపతుల కుమారుడు మహేంద్రరెడ్డి (30)... అమడగూరు మండలం గుండువారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. అవివాహితుడైన ఆయన రోజూ ఇంటి నుంచి పాఠశాలకు ద్విచక్రవాహనంలో రాకపోకలు సాగించేవారు. యథావిధిగా మంగళవారం ఉదయం పాఠశాలకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరిన ఆయన ఆ రోజు రాత్రైనా ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు... బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం చెర్లోపల్లి రిజర్వాయర్ వద్ద మహేంద్రరెడ్డి వాహనం, సెల్ ఫోన్, ఇతర సామగ్రి ఉన్నట్లు సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని వాటిని పరిశీలించి తమ కుమారుడివేనని నిర్ధారించారు. దీంతో వాటిని కదిరి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం ఉదయం మరోసారి కుటుంబసభ్యులు రిజర్వాయర్ వద్దకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే నీటిపై తేలుతున్న మహేంద్రరెడ్డి మృతదేహాన్ని గుర్తించి కన్నీరుమున్నీరుగా విలపించారు. ద్విచక్రవాహనంపై పాఠశాలకు వెళ్తున్న తమ కుమారుడు మహేంద్రరెడ్డి మార్గమధ్యంలో చెర్లోపల్లి రిజర్వాయర్ వద్ద బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మృతిచెందాడని తండ్రి రామకృష్ణారెడ్డి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేయడంతో ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన విజయకుమార్

లేపాక్షి: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం వడ్డిచెన్నంపల్లికి చెందిన విజయకుమార్ (22) తల్లిదండ్రులతో పాటు కలిసి ఉంటూ గృహ నిర్మాణ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గృహ నిర్మాణ పనుల్లో పాల్గొనేందుకు గురువారం ఉదయం లేపాక్షి మండలం చోళసముద్రం గ్రామానికి వచ్చాడు. పనులు ప్రారంభించే ముందు అవసరమైన నీటి కోసం మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన తోటి కూలీల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని బాధితుడిని హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తువంకపల్లిలో మరో వ్యక్తి...


నంజప్ప మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఓడీచెరువు: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓడీ చెరువు మండలం టి.కుంట్లపల్లికి చెందిన నంజప్ప(65) మృతిచెందాడు. మండలంలోని ఇనగలూరు పంచాయతీ పరిధిలోని తువంకపల్లిలో రైతు వెంకట్రామిరెడ్డి పొలంలో గురువారం విద్యుత్ తీగ తెగి కిందపడింది. దీంతో రైతు అభ్యర్థన మేరకు నంజప్ప అక్కడకు చేరుకుని మరమ్మత్తు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య


హర్షవర్ధన్ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: పెళ్లి కాకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన గంగప్ప, రత్నమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న కుమారుడు హర్షవర్ధన్ (27)కు పెళ్లి చేసేందుకు ఐదేళ్లుగా తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. అయితే ఏ ఒక్కటీ కుదరకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన హర్షవర్ధన్ గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తల్లి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు హర్షవర్ధన్‌ను కాపాడి ఆగమేఘాలపై పుట్టపర్తిలోని సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి గంగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

సాక్షి
స్పోర్ట్స్
శుక్రవారం
2-2-2024



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అస్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీఐపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహాన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాతే ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్‌గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ



● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్‌ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

చలో రష్యా



● కమల్‌హాసన్

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

మహేశ్ సినిమాలో?



● నాగార్జున

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తి శ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ- ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ- ''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రస్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రస్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

- దేవ్ జాంద్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ- ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.